# ఆమె గృహంలో అతని స్వగృహం

నమస్తే! డాక్టర్!

శేఖరం గొంతువిని చకితురాతురై వెనక్కి తిరిగింది ఆమె. రోగికి యిచ్చే యింజక్షన్ అలాగే పరిశీలిస్తూ నవ్వింది. ఆ నవ్వులోనే ఆహ్వాన మందింది. శేఖరం ఆమె గదిలోకి పోయి కూర్చున్నాడు. రోగుల నొక్కొక్కరిని పంపించిచేసి పది నిమిషాల ఆలస్యంగా గదిలోకి వచ్చి కూర్చుంది ఆమె.

శేఖరం ఆమె అలమారులో నున్న వైద్యగ్రంథాలు ఒక్కొక్కటీ పరిశీలించడం. మొదలు పెట్టాడు ఆమెవచ్చే లోగా.

శేఖరం చదువుతున్న పుస్తకం వెనకనుంచి వచ్చి చూసింది.

"ఛీ! ఆపుస్తకం మీదు చదవకూడదు!"

"ఆ విజ్ఞానం మీకుతప్ప మాకు తెలియ కూడదా?" నవ్వాడు శేఖరం,

"అది ఆడవాళ్ళకు సంబంధించింది. మగవాళ్లు చదవ కూడదు!"

"మగవాళ్ళకు సంబంధించేది ఆడవాళ్లుకూడా చదవ కూడదు!"

ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ నవ్వుల్లో ఒకరినొకరు చూసుకున్నారు. సూటిగా, కోపంగా, అభిమానంగా.

"ఏమిటో యిలా హఠాత్తుగా వచ్చారు! మీ రాక వల్ల నా ప్రాక్టీసు సగం పోతోంది!"

"నా రాకవల్ల మీ పురోభివృద్ధి ఆగిపోతే చాల సంతోషం. ప్రాక్టీసు లేకపోతే ఒంటరిగా గోళ్లు గిల్లుకుంటూ మీరు కూర్చుంటుంటే, నేను వచ్చి కబుర్లుచెప్పి మిమ్మల్ని విసిగించవచ్చు!"

నవ్వాడు శేఖరం.

"అంటే మీరునాకు పరమ శత్రువన్న మాట."

"అవును, ముమ్మాటికి నిజం! ఒక్క చూడాలనే ఆకాంక్ష తప్పిస్తే నాలో మిమ్మల్నిగూర్చి బద్ధవైరం ప్రబలి పోతోంది.

"ఆ వైరానికి కారంరాసి, ఉప్పు అద్దుకుని తినండి! మరీ హాయిగా వుంటుంది!" గృహిణి వంటకం రుచి జ్ఞప్తికి తెచ్చింది ఆమె.

ఒక క్షణం నిశ్శబ్దం.

"...అసలు విషయం చెప్పనా? చెప్పాలనే వచ్చాను. మీ రేమనుకుంటారు!"

"చెప్పండి" డాక్టరు దగ్గరకువచ్చి రోగం సంగతి దాచకుండా చెప్పాలి!"

"నేను రోగిని కాదు."

"మరి భోగిలనుకుంటా! తెగతిని లావెక్కి, అజీర్ణంతో బాధపడుతున్నారా?" నవ్వు ఆపుకున్నాడు శేఖరం.

"వచ్చే పదిహేనవ తారీఖు నా పెండ్లి!"

"ఏం పెళ్ళి? హేళనగా నవ్వింది ఆమె.

"అదే పెళ్ళి... అందరూ చేసుకునేదే!"

"నిజంగా!"

"అబద్ధ మెందుకూ!"

"ఇంతకాలం పెళ్ళిచేసుకునేట్టే మాట్లాడలేదు. ఇంత హఠాత్తుగా"

"అవును, హఠాత్తుగా కాదు. కొన్ని సంవత్సరాల నుంచి జరుగుతోంది యీ వ్యవహారం!"

"అయితే యింతకాలం నాతో చెప్పే మాటలు అబద్ధమన్నమాట !'' ఆమె ముఖం ముకుళించుకుంది; తల జడ సర్దుకుంది.

"అబద్ధంకాదు... మీకు చెబితే మీరు బాధపడతారని వూరుకున్నా."

''బాధపడడ మెందుకు చాలా సంతోషిస్తా... ఎవరో ఆ అదృష్టవంతురాలు. తెలుసుకోవచ్చా ?''

"ఆ-ఆమెకూడా ఒక డాక్టరు''

''ఎవరు ? పేరు ?''

''మీరు ఆమెకు తెలుసునని ఆమె చెప్పింది..."

''పేరు చెపితే...

''మీ యిద్దరికీ చాలా రోజుల నుంచి స్నేహం !"

''సరోజిని అనుకుంటా !"

"కాదు.''

"మాదవతా ?''

"ఉమా..."

"విజయలక్ష్మి".

"ఆ పేర్లుకాదు''.

"మరి పేరు చెప్పరాదూ !'' విసుగ్గా అడిగింది.

"తర్వాత చెప్తాలే !"

"ఎల్లా వుంటుంది ?"

"లావుగా బొద్దుగా... తెల్లగా... నిగనిగ లాడుతూ కిల కిల నవ్వుతూ..."

"బాగుంది వర్ణన... అర్థంలేని వర్ణన...!"

"ఉన్న విషయం చెప్పాను..."

"పేరు చెప్పరూ..."

"ఊహించుకోలేవా... మీ స్నేహితుల్లో ఎవరో..."

"ఇక్కడకే ఒకసారి ఆమెను తీసుకురండి..."

"ఎందుకు"

"చూస్తా"

"పెళ్ళినాడు చూడొచ్చు"

"ఉహు ఈలోపుగా చూడాలి !"

"వీల్లేదు !"

"మీ కాబోయే భార్యకు మంచినగలు, చీరలు కొందాం.... నేనూ వస్తా బట్టలషాపుకు"

"ఆ మాత్రం నాణ్యం నాకు తెలియదనా"

"మీకేం తెలుసు ! మొగవాళ్ళకి ! కందిపప్పు భోం చేయడం తెలుసు !"

ఆమె పక పక నవ్వింది.

"సరే" నా పెళ్ళిఅన్నా. నా భార్య అన్నా మీకు అంత హేళన అన్నమాట !"

శేఖరం కోపం అభినయించాడు.

"అయితే పేరు చెప్పరుగదూ"

"నిజంగా చెప్పనా..."

"ఊఁ"

"ఆమె పేరు...నీ..."

"అంటే...నీరద ?"

"కాదు..."

"నీరజ"

"కాదు"

"మరి... చెప్పకూడదూ విసిగించకపోతే..."

"నీ పేరే !"

"ఆ, ఆమె కోపంతో మూతి త్రిప్పుకుంది. ఎందుకు యిలా దొంగనాటకాలు ...మాటలు మార్చడం! ...ఇప్పుడు అర్థమయింది...యింకెప్పుడూ యిలాంటి ఆత్రుత చూపను! నాకెందుకు మీభార్య పేరు ఏదయితేనేం!" సంభాషణ మళ్ళించి టేబిలుమీదున్న పత్రిక తీసి చదవడం మొదలెట్టింది ఆమె.

"ఆ పేపరు ... పేరు ? శేఖరం నవ్వు బిగబట్టుకుంటూ ప్రశ్నించాడు.

" గాడిదగుడ్డు "

"అది నా కివ్వగూడదూ... దయయుంచి" శేఖరం యాచించాడు.

ఆమె నవ్వు ఆపుకోలేక కలకల నవ్వుతూ, ఆ పత్రిక శేఖరంమీదికి గ్రుడ్డు విసిరినట్లు విసిరింది.

"ఇందులో అబద్ధ మేముంది... నేను ఒక్కొక్కసారి ఊహించుకుంటా యిలా జరుగుతుందని... కాని అసలు పాణిగ్రహణం మునుపే జరిగిపోయింది. జీవితంలో ఆశించిన వన్నీ లభించవు! కొంతమంది దొరికిన వాటితో సంతృప్తి పొందుతారు! నా జీవితం వేరు... ఆశించనిది లభ్యంకాక పోతే, యింక అటువంటి ఆశలకు ఆదే ఆఖరు!"

శేఖరం నిట్టూర్పు విడిచాడు ... అతని ముఖంలో బాధ సుళ్ళుతిరిగినట్లు ఆమె గమనించింది.

"సరేలేం... మీ పెళ్ళి సంగతి కేంగాని... నా పెళ్ళి నాటి ఫొటోలు చూస్తారా ?"

ట్రంకులోని ఒక పేకెట్టు పైకి తీసింది ఆమె.

శేఖరం నిశ్శబ్దంగా ఆమెవైపు చూస్తున్నాడు.

" ఇది బొంబాయిలో తోటల్లో స్నేహితులతో తీయించుకున్నా .."

"ఇది... పెళ్ళినాడు... తలంబ్రాలు పోస్తుండగా..."

"ఇది నా స్నేహితులు బహుమతులిస్తూంటే తరువాత నన్ను మొట్టమొదటిసారి పెళ్ళికూతురుని చేసినప్పుడు ... ఇది

మా తోటికోడలుతో ... మా అక్కయ్య సంసారముతో యిది..."

అనేక ఫొటోలు కళ్ళముందు తిరిగాయి. ఆమె జరీ అంచు చీరతో, గుండ్రని తేజస్సు వదనంతో, మిలమిలా మెరిసే కాంతితో దివ్యంగా వెలిగిపోతూ ఎచ్చటో బయలు ప్రాంతములో కొండరాయిమీద కూర్చొని తీయించుకున్న ఫొటో చూశాడు శేఖరం ... అందుకున్నాడు అడిగి ... తనివి తీర చూశాడు ... ఆమెలో ఉన్న అందమంతా అందులో స్పష్టంగా తొణుకుతోంది ... ఆ చూపుల్లోంచి మనస్సంతా కలచి, కెలికే, అనంతమైన ఉద్రేకాలు కలుగుతున్నాయి ... ఎదురుగా ఉన్న స్వరూపానికీ, ఆ ఫొటోకి చైతన్యంలో ఎక్కడా విభేధం లేదు.

"ఈ ఫొటో నాకు కావాలి !"

జేబులో పెట్టుకోబోయాడు శేఖరం.

"అలా పనికిరాదు ... పరాయి స్త్రీ ఫొటో అలా దొంగిలించ కూడదు" బలవంతంగా లాక్కుంది ఆమె.

శేఖరం కన్నీరు ఉబికింది కొలకుల్లో. ఒక హక్కుగా పొందవలసిన ఆమెను పోగొట్టుకొని, ఒక్క ఫొటోకూడా కలిగివుండే అదృష్టంకూడా లేకుండే దురదృష్ట వంతుణ్ణి అను కున్నాడు లోలోపల.

"ఎవరి అదృష్టం ఎంతో అంతే! మీ తప్పేముంది?"

శేఖరం కంఠం గద్గద మయింది.

ఆమె ఫొటోలు తిరిగి పెట్టెలో పెట్టేసింది.

దాసి ఒకప్లేటులో బిర్యానీ తీసుకు వచ్చింది. ఆమె అందుకుని టేబిలుమీద పెట్టింది.

"తినండి... మీ కాబోయే పెళ్ళికి డిన్నరు" నవ్వింది.

"మంచి నీ ళ్లేవి?! ఉత్తి అన్నం బొక్కమనా?.

"మంచి నీళ్ళెందుకు! అన్నం తింటున్నప్పుడుకూడా! మధ్య మధ్యలో ఏడుస్తుంటే, ఆ కన్నీరే మంచినీరుగా మారి నోట్లోకి పోగలదు గా" ఆమె కిలకిల నవ్వింది. ఆ నవ్వుతో హాయిలుగా తిరిగింది. ఆ తిరుగులలో ఆనందం కురిసింది. ఆ ఆనందంలో ఏదో విజయగర్వం తొణికింది.

"నేను నీముందు ఎప్పుడూ ఓడిపోయిన వాడనే!" తలవంచుకున్నాడు శేఖరం.

"ఇంక పళ్ళెంమీదకు దృష్టిపోవడం ఆరోగ్యకరం"

దాసి గ్లాసులో మంచినీళ్ళు. ఒక ప్లేటులో పళ్ళు తెచ్చి అందించింది.

"ఊ! తినండి... తినిపించాలా?" పకపక నవ్వింది ఆమె.

శేఖరం ఉపక్రమించాడు భోజనానికి.

"ఇటువంటి పరిస్థితి రోజూ నా జీవితంలో వుంటే ఎంత బాగుంటుంది?"

"రోజూ వుంటే, మొహమెత్తి అసహ్యించు కుంటారు !" ఆమె చెప్పింది.

"అది నాగుణం కాదు; నాలో... ప్రతీ అణువు..." శేఖరం ఏదో అనబోతూంటే ఆమె మధ్యలో ఆపి, "బిర్యానీ కణాలతో నిండిపోతోంది !" ఆమె పకపక నవ్వింది అతి సంతృప్తిగా !.

"నాకు నిజంగా ఆనందంగా వుంది. ఏం చక్కగా మాట్లాడతావు... ప్రాణం లేచివస్తుంది"

"ఇంకా నయం ! లేచిపోతోంది అన్నారు కాదు... ఎవరితోనో అని అడగవలసి వచ్చేది !"

"మీతోనే" శేఖరం పెదాలమీద చిరునవ్వు వెలిసింది.

ఆమె కోపం తెచ్చుకుంది.

"అటువంటి మాటలు అనకండి... ఏదో మంచిగా నేనుంటే అంతా గతం త్రవ్వుతున్నారు... మీరు ,మంచిగా వుంటేనే యిలా రానిచ్చేది... మీ భార్యే యిలా చేస్తే ఏం చేస్తారు ! ఆమె తలవంచుకుని ప్రశ్నించింది.

"చాలాసంతోషిస్తా ! ఆ అభాగ్యుడిని పిలిచి ఆమెను అందిచ్చి భాగ్యవంతుణ్ణి చేస్తా ! యిష్టంలేని దాంపత్యాలు గడిపేకంటే, తప్పిపోయిన యిష్టమున్న దాంపత్యాలు నిల పడం మంచిది !"

"నీతులు మాట్లాడడం సులువు! ఆచరణలో పెట్టడము కష్టం!"

శేఖరం భోజనం ముగించాడు. వేడినీళ్ళు చేతిలో తోరిపి అతనిచేతులు కడిగింది.

తువ్వాలు అందించింది.

వక్కపొడి, తాంబూలం ఎదురుగా పెట్టింది.

"ఈ రాత్రి ఏమిటో అనిపిస్తోంది !''

"అనిపిస్తుంది... యింట్లోనుంచి బయటికి గెంటేదాకా" ఆమె కోపంగా నవ్వింది రాత్రి తొమ్మిది గంటలు.

ఎదురుగా అలమారాలో ఏవో పెద్దపుస్తకాల దొంతలు కనిపించాయి

"ఏం పుస్తకాలు అవి!''

"ప్రపంచములో పెద్ద వైద్యుల జీవిత చరిత్రలు!"

"నేనొకసారి తీసుకువెళ్ళి చదవ్వచ్చా!"

"తప్పకుండా. కాని ఏమిస్తారు పైసా!''

"ఎంత యిమ్మంటే అంతా !"

"ఏదీ మొదట మీ పర్సు యిలా యివ్వండి"

శేఖరం అందించిన పర్సు ఆమె తనిఖీ చేసింది! "సుఖంగా బ్రతుకు'' అని వ్రాయబడిన అక్షరాలు పైకి చదివింది. పర్సులో ఒక అరలో పాశ్చాత్య స్త్రీ నగ్నచిత్రం చూసి చకితు రాలైంది.

"ఏమిటి! యిటువంటి బొమ్మలు ఆరాధిస్తారా!"

"నేను ఆరాధించడ మేమిటి? అది పర్సు యిచ్చిన కోమటి బహుమతిగా యిచ్చాడు" శేఖరం నవ్వాడు.

"ఛీ!" ఆమె బొమ్మతీసి పరపర చింపేసింది.

శేఖరం మౌనంగా కూర్చున్నాడు ఆమెవైపు చూస్తు.

"కోపం వచ్చిందా"

"లేదు... ఆ హక్కు మీకు ఉంది!"

ఆమె కలకల నవ్వింది.

పర్సులో పదిరూపాయల నోట్లు పది కనిపించాయి.

"ఇవి కూడ చింపేయనా"

ఆమె ఓరగా చూసింది.

"ఊఁ, ఆ హక్కు కూడా మీకు ఉంది!"

"చింపడం అంటే తగులబెట్టడం అన్నమాట! తగల బెట్టడం అంటే ఖర్చుపెట్టడం అన్నమాట!" ఆమె వ్యాఖ్యానించింది.

"నా సర్వస్వం ఖర్చుపెట్టే హక్కు మీకు ఉంది. నా దగ్గర ముప్పయి అయిదు వేల పైగా ఆస్థి వుంది! అది సీకు అంకితం!"

"బాబోయి! యీ అంకితం భరించలేను. యిప్పటికే లావు అంటున్నారు. ఆ ఆస్తి తీసుకుని యింకా లావెక్కి బాధపడాలనా మీ ఉద్దేశ్యం."

"అది లావు కాదు... మీ వయసు మనిషికి శరీరం అందం... నాకు ఆనందం!"

"చాల్లెండి కవిత్వం!"

"ఆ నీలి చీరలో-చుక్కల మధ్య ఒక ఆకాశ కన్యలా"

"ఛీ పో పో! భటాౖజు వచ్చేరా... తందానా తానితందనాౖ!

"బుర్రకథా?"

"మీ బుర్రకథ!" ఆమె కలకల నవ్వింది. పర్సు వాపసు చేసింది.

"ఇంట్లోనేగా నేను చీరలు- మంచివి కట్టుకునేది. ఆస్పత్రిలో మంచిచీరలు కట్టనివ్వదు మా ఆఫీసరు... ఇదే మన్నా పెండ్లి పందిరా అని అడుగుతుంది... ఆవిడ... ఆవిడకేం ముసల్ది అయిపోయింది... చిన్నతనంలో అనుభవించి ఉండవచ్చు... వృద్ధనారీ పతివ్రతా! అని... ఒళ్ళు మండుతుంది ఒక్కొక్కసారి ఆవిడ నీతులు వింటూంటే... గాజులుకూడా వేసుకోం... చూశారుగా చేతులు... యిదీ మా ఉద్యోగం... మానవ సేవ కోసం, మధురమైనవన్నీ వదులుకునే బ్రతుకు మాది!" నిట్టూర్చింది. ఇంట్లోంచి పాప ఏడుస్తూ వచ్చింది...

"నిద్ర రావటంలా!" బుజ్జగించింది ఆమె పాపను.

తల్లీ, బిడ్డ ... ఎదురుగా తాను ... గుండె కరిగిపోయింది ఇటువంటి దృశ్యాలు జీవితంలో అనుభవించవలసింది. ఏదో ఊహాగానంలో క్షణికమైన సత్యాన్ని ఊహించి ఆనందించవలసి వస్తోంది.

ఆమె లేచి వెళ్ళి పాపను పడుకోబెట్టి వచ్చింది.

గడియారం పదికొట్టింది,

"ఇంక వెడతారా ?" ఆమె బరువుగా ప్రశ్నించింది.

ఇదే తన స్వగృహ వాతావరణ మైయుంటే ఆమె యిలా ప్రశ్నించి ఉండేదా !

"పోయి పడుకోండి ... నాకు నిద్రవస్తోంది" ... అని నర్మగర్భంగా కసిరేది.

శేఖరం హృదయంలో ఏదోబాధ ఆ ఊహలో ఏదో ఆనందం ఉప్పిరిగొన్నాయి.

వీధి కాంపౌండులోకి నడిచాడు ... బాధగా ...

"డాక్టరు ... నేనురోగిని ... నా రోగానికి మందు ఎప్పుడిస్తావు ?"

"మీ కే రోగం లేదు. పిడుగులా వున్నారు!"

"అవును అందుకే ... అలా బోగంకొంపలకు ఈ రాత్రి పోయి - దినాలు గడిపి – రోగాల తేలి ... కుష్ఠురోగంతో నీ దగ్గరకువచ్చి మందిమ్మంటే యిస్తావా !"

"ఛీ ! అవేంమాటలు !"

శేఖరం నిట్టూర్చాడు,

నెలక్రితం వీధిగుమ్మం వెలుగులో నిలుచుని ఉన్న మొండి గులాబి అంటు ఆరోజు ఒక మొగ్గధరించింది. గుమ్మం మెట్లు దిగాడు.

ఆమెకూడా అతన్ని అనుసరించి దిగింది. అతను వీధిలోకి నడిచాడు. ఆమెకూడా అతన్ని అనుసరించింది.

"భోగం కొంపలకు అటుకాదు దారి... వెనక్కే—" ఆమె నవ్వుతో హెచ్చరించింది.

శేఖరం నవ్వాడు. ఆమె మెట్లుదిగి తనతో వీధిలో నడుస్తుంటే... ఏమిటో అనుభూతి... నవ్వుకున్నాడు శేఖరం.

''మళ్ళీ దర్శనం...'' శేఖరం జాలిగా చూశాడు. ఆగిపోయి గృహోన్ముఖంగా తిరిగిన ఆమెచూసి...

"ఈసారి మీభార్యతోరండి!" ఆమె కలకలానవ్వుతూ—గాలిలో. గాలిలోని వెలుగులో, వెలుగు చీల్చు చీకటి నీడలో కలిసిపోయింది. వీధిమలుపు మళ్ళింది యింక కనుచూపు దూరములో ఆమె కనిపించక పోవడముతో, అట్టే నిలుచున్న శేఖరం రహదారిలోకి నడిచాడు...

వీధిలో వేపచెట్లమీద గూడుల్లో కాపురముచేస్తున్న జంటపక్షులు పలికే జాలి మాటలకు స్పందించి వేడి కన్నీరు కార్చేడు శేఖరం.